ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 27 ఆగస్టు 2024 | 5




పిచ్చుకలంకను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతాం

- పెట్టుబడులు పెట్టేందుకు ఒబెరాయ్ ముందుకు..
- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

వార్త..7లో



కూటమి ప్రభుత్వం ఏర్పడగానే పిచ్చుకలంక అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. మూడు సార్లు కలెక్టర్, మంత్రులు, ఎమ్మెల్యేలు పరిశీలించడంతో కల సాకారమవుతుందనే ఆశతో ప్రకృతి ప్రేమికులు ఎదురుచూస్తున్నారు. సోమవారం పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఇతర అధికారులు పిచ్చుకలంక ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ పరిణామాలతో ఆశలు రేకెత్తుతున్నాయి..



పిచ్చుకలంక ప్రాంతం



కాటన్ బ్యారేజీ

అల పిచ్చుకలంకలో..

అఖండ గోదావరి పరవళ్లు, సర్ ఆర్ధర్ కాటన్ బ్యారేజీ అందాలు, అందమైన పక్షుల కిలకిలరావాలు మొత్తం కలిసి పిచ్చుకలంక అందాలు.. అయితే ఇంతటి అందమైన ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ఎందుకో అడుగులు వడివడిగా పడడం లేదు. దశాబ్దాల తరబడి ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోకుండా ఉంది. ప్రభుత్వాలు ఎన్ని మాటలు చెప్పినా నీటి మీద రాతలుగానే మిగిలిపోయాయి. జరిగిన కాస్త అభివృద్ధి కూడా టీడీపీ హయాంలోనే జరిగింది. మూడున్నర దశాబ్దాల పర్యాటక రంగం కల నెరవేరకపోవడంతో పర్యాటక ప్రియులు ఆవేదన చెందుతున్నారు.

ఆత్రేయపురం, ఆగస్టు 26:

- పర్యాటక కేంద్రంగా పిచ్చుకలంక..
- కూటమి ప్రభుత్వం అడుగులు
- ఒబెరాయ్ సంస్థ సహకారంతో..
- దశాబ్దాల కల నెరవేరేనా?

ఉభయ గోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న కాటన్ బ్యారేజీ పక్కనే ఏర్పడిన పిచ్చుకలంక ఇరిగేషన్ పరిధిలో ఉంది. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో టీడీపీ ప్రభుత్వం బీజం వేసింది. ఇరిగేషన్‌కు చెందిన ఈ భూములను రక్షించేందుకు అప్పటి ఎన్టీఆర్ హయాంలో ప్రణాళిక మండలి ఉపాధ్యక్షుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి 1988 ఏప్రిల్ 20న శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పించింది. అప్పటి టీడీపీ హయాంలోనే ఈ భూములను పర్యాటక సంస్థకు కేటాయించారు. ఇది ఒక కీలక మలుపు అయింది.

ఎన్టీఆర్ హయాంలో బీజం

155 సర్వే నెంబరులోని సుమారు 56 ఎకరాల భూములను పర్యాటక సంస్థకు అందించారు. పిచ్చుకలంక చుట్టూ పెన్సింగ్ వేసి ముఖ ద్వారం సైతం ఏర్పాటు చేశారు. అనంతరం ప్రభుత్వాలు పిచ్చుకలంక అభివృద్ధికి కనీస చర్యలు చేపట్టలేదు. మంత్రులు, వివిధ సంస్థలు సైతం పరిశీలించి వెళ్లాయి తప్పా అభివృద్ధికి నోచుకోలేదు. చంద్రబాబు పార్టీ హయాంలో ఓషేన్ అనే పార్క్ సంస్థ రూ.16 కోట్లతో డ్రెడ్జింగ్ (మెరక పనులు) చేపట్టింది. దీంతో పిచ్చుకలంకను పర్యాటకంగా అభివృద్ధి చేస్తారనే అందరూ భావించారు. అయితే తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో పనులకు ఆటంకాలు ఏర్పడ్డాయి.

ఎన్టీఆర్ హయాంలో వేసిన శిలాఫలకం



ప్రభుత్వం..ఒబెరాయ్.. సంయుక్తంగా..

కూటమి ప్రభుత్వం పిచ్చుకలంక అభివృద్ధిపై సీరియస్‌గా ఉన్నట్టే కనపడుతోంది. ముంబయికి చెందిన ఒబెరాయ్ సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. సోమవారం పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పర్యటనలో ఒబెరాయ్ సంస్థ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ఈ నెల 5న ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ పిచ్చుకలంక పరిశీలించి వెళ్లారు. 11న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ పిచ్చుకలంక ప్రాంతాన్ని క్షుణంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదించారు. ఈ నేపథ్యంలో మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కలెక్టర్ మహేష్‌కుమార్ సోమవారం ఒబరాయ్ సంస్థ ప్రతినిధులతో కలిసి పిచ్చుకలంక ప్రాంతాన్ని సందర్శించారు. వరుసగా జరుగుతున్న పర్యటనలు, ప్రతిపాదనలతో మూడన్నర దశాబ్దాల పర్యాటక కేంద్రం ఏర్పాటు కల సాకారం అవుతుందని ఈ ప్రాంత వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పిచ్చుకలంక ముఖద్వారం



రూ.75 కోట్లతో లొల్ల లాకుల

ఆధునికీకరణ

- ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం ఆదేశాలు
- లాకులను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే



లాకులను పరిశీలిస్తున్న కలెక్టర్ తదితరులు

ఆత్రేయపురం, ఆగస్టు 26: కోనసీమ రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని లొల్ల లాకుల ఆధునికీకరణను రూ.75 కోట్లతో చేపట్టేందుకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. లాకుల పునఃనిర్మాణానికి ప్రభుత్వం ప్రతిపాదనలు పంపాలని ఆదేశించిందని ఈ అంశాన్ని శాసనసభలో కూడా ప్రస్తావించామని ఎమ్మెల్యే బండారు చెప్పారు. సోమవారం అధ్వాన స్థితిలో ఉన్న లొల్ల లాకులు, కాటన్ బ్యారేజీని ఎమ్మెల్యేతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. 137 ఏళ్ల క్రితం నిర్మించిన లాకుల వ్యవస్థ శిథిలస్థితికి చేరుకుందని మూడు ప్రధాన కాలువల ద్వారా 2 లక్షల ఎకరాల సాగునీరు కోనసీమలోని 5 నియోజకవర్గాలకు ఈ లాకుల ద్వారానే అందుతుందని కలెక్టర్‌కు ఎమ్మెల్యే వివరించారు. అలాగే ఉభయగోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న కాటన్ బ్యారేజీపై రహదారి గోతుల పడి ప్రయాణికులు అవస్థలు పడుతున్నారన్నారు. గత ఏడాది తూర్పు కలెక్టర్ రూ.2 కోట్లు నిధులు మంజూరు చేయగా ఆ జిల్లా పరిధిలోని బ్యారేజీపై మరమ్మతులు చేశారు. కోనసీమ పరిధిలోని బ్యారేజీ మధ్య భాగం ర్యాలి ఆర్మ్ సుమారు కిలోమీటర్ మేర అప్పటి జిల్లా కలెక్టర్ రూ.30 లక్షలు నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయని కలెక్టర్‌కు ఎమ్మెల్యే వివరించారు. తక్షణమే నిధులు మంజూరు చేసి బ్యారేజీ మరమ్మతు పనులు చేపట్టాలని ఆయన కోరారు. బ్యారేజీ, లొల్ల లాకుల అధ్వానస్థితిని కలెక్టర్ మహేష్‌కుమార్ క్షుణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, క్లస్టర్ ఇన్‌చార్జులు ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహారావు, ముళ్లపూడి భాస్కరరావు, కాయల జగన్నాథం, జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు బండారు బాబి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.





ఫ్లైఓవర్ కలేనా?



రావులపాలెం ప్రధాన సెంటర్‌లో ఇలాంటి ట్రాఫిక్ జామ్‌లు నిత్యకృత్యం

- రావులపాలెంలో ఫ్లైఓవర్ నిర్మాణం జరిగేనా?
- తరచూ ప్రమాదాలు..నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు
- అయినా చలనం లేని వైనం
- వ్యాపారులు అడ్డుకుంటున్నారనే ఆరోపణలు

● (రావులపాలెం)

అతివేగంగా నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే జాతీయ రహదారి సెంటర్ దాటాలంటే హడలిపోయే పరిస్థితి. సెంటర్ దాటే సమయంలో ఆదమరిస్తే ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఎప్పుడైనా ప్రమాదం జరిగినప్పుడు రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులు రాకపోకలు సాగించే సమయంలో ఈ సెంటర్ వద్ద భారీగా ట్రాఫిక్ నిలిచిపోతే అధికారులు హడావిడి చేయడం తర్వాత పట్టించుకోకపోవడం పరిపాటిగా మారిందే తప్ప శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముఖద్వారం రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్ వద్ద ఫ్లైఓవర్ నిర్మించకపోవడంతో వాహనదారులు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఈ సెంటర్ దాటాల్సిన పరిస్థితి వస్తోంది. ఎప్పుడు ఎవరు ఎలా వస్తారో తెలియని అయోమయ పరిస్థితి ఈ ప్రధాన సెంటర్‌లో నిత్యం ఉంటుంది..

ట్రాఫిక్ పద్మవ్యూహంలో..

చెన్నై నుంచి కోల్‌కతా వరకు ఉన్న జాతీయ రహదారి రావులపాలెం, ఆలమూరు మండలాల మీదుగా సుమారు 25 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. జిల్లాలోని ప్రజలు, అధికారులు జిల్లా కేంద్రమైన అమలాపురం వెళ్లేందుకు ఈ సెంటర్ మీదుగానే రాకపోకలు సాగించాల్సి ఉంది. నిత్యం వందలాది వాహనాలు అతివేగంగా ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ సెంటర్ వద్ద ప్రమాదాలు జరిగి పలు సందర్భాలలో వాహనదారులు ప్రాణాలు పోగొట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. పుణ్యక్షేత్రంగా ఖ్యాతిగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లే భక్తుల వాహనాలతో శనివారం రోజున మరింత రద్దీ పెరుగుతుంది. ఆ సమయంలో ట్రాఫిక్ నిలిచిపోయి గంటల తరబడి ట్రాఫిక్‌లోనే పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ ఫ్లై ఓవర్ నిర్మించాలంటూ పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు. అయినప్పటికీ అధికారులు, పాలకులు హామీలే తప్ప శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

సర్వే నివేదికలన్నీ బుట్టదాఖలు

రావులపాడు వంతెన వద్ద నుంచి రావులపాలెం ప్రభుత్వ కళాశాల వరకు ఫ్లైఓవర్ నిర్మించేందుకు గతంలో అధికారులు సర్వే చేశారు. సర్వే చేసిన సమయంలో ప్రజలు ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మిస్తారు మనకు ట్రాఫిక్ కష్టాలు తీరుతాయని అనుకున్నారు. ఆ తర్వాత సర్వే నివేదికలన్నీ బుట్టదాఖలయ్యాయి. ఆలమూరు మండలం జొన్నాడ జాతీయ రహదారి సెంటర్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం ప్రారంభించిన సమయంలో ఇక్కడ కూడా నిర్మిస్తారని చర్చ జరిగింది. వాణిజ్య కేంద్రం దినదినాభివృద్ధి చెందుతున్న రావులపాలెం వ్యాపారకలాపాలకు నెలవుగా మారింది. ఇక్కడకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి షాపులను అద్దెలకు తీసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో భవన యజమానులకు రూ.లక్షల్లో అద్దెలు వస్తున్నాయి. ఫ్లైఓవర్ నిర్మాణం జరిగితే వ్యాపారాలు దెబ్బతింటాయని వ్యాపారులు, వ్యాపారాలు లేకపోతే అద్దెరూపంలో వచ్చే ఆదాయానికి గండి పడుతుందని భవన యజమానులు ఫ్లైఓవర్ నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. ట్రాఫిక్ నియంత్రణకు శాశ్వత పరిష్కారం దొరకాలంటే ఈ ప్రాంతంలో ఫ్లైఓవర్ నిర్మాణం తప్పనిసరని ఈ కూటమి ప్రభుత్వంలో ఫ్లైఓవర్ నిర్మాణం కార్యరూపం దాలుస్తుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

డీఎస్పీగా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



అమలాపురం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలను పూర్తి స్థాయిలో అదుపులో ఉంచేందుకు కృషి చేస్తానని అమలాపురం డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన టీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం ఇంటెలిజెన్స్ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న ప్రసాద్‌ను ఇటీవల అమలాపురం బదిలీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన మహేశ్వరరావును పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయమన్నారు. బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ ప్రసాద్‌ను అమలాపురం పట్టణ సీఐ కె.క్రిస్టఫర్, తాలూకా సీఐ పి.వీరబాబు, పలువురు ఎస్ఐలు మర్యాద పూర్వకంగా కలుసుకుని అభినందనలు తెలిపారు.



నిండు శోకంతో..

- అర్జైన్ నిర్వహించిన ముస్లింలు
- బాధాతప్త హృదయాలతో మాతం
- ఇమామ్ హుస్సేన్, పరివారానికి నివాళి

8లో

అనుమానం పెనుభూతమై..

భార్యను దారుణంగా చంపిన భర్త

7లో

ప్రతి ఇల్లు ఓ గోకులం



అమలాపురంలో..



కపిలేశ్వరపురంలో..



కొత్తపేటలో..



పి.గన్నవరంలో..



అమలాపురంలో..

అల్లరి కృష్ణయ్యల వేషధారణలతో చిన్నారులు ఇంటింటా సందడి చేశారు.. గోపికల వేషధారణలో ఉన్న బాలికలను ఆటపట్టించారు. శ్రీకృష్ణాష్టమి వేడుకలతో ప్రతి ఇల్లు ఓ గోకులంలా మారింది.. గీతా గోవిందానికి వేదికైంది.. జిల్లా వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఊరూరా ఉట్టికొట్టి సంబరాలు చేసుకున్నారు..



అమలాపురంలో..

వార్తలు..8లో

హ లీ చ లీ



మోతుగూడెంలో కింగ్ కోబ్రా

డాక్టర్ అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలోని ఏపీ జెన్‌కో ఆసుపత్రిలో కింగ్ కోబ్రా కలకలం సృష్టించింది. ఆదివారం రాత్రి తొమ్మిది గంటలకు వాచ్‌మన్ సురేష్ బయట వరండాలో లైటు వేయడానికి వెళ్లాడు. ఆ సమయంలో సుమారు 12 అడుగుల కింగ్ కోబ్రా పాత ఓపీ గదిలోకి ప్రవేశించింది.దీంతో భయపడ్డ వాచ్‌మన్ ఆ గది తలుపులు మూసేసి విషయాన్ని మేనేజ్‌మెంట్‌కు తెలపగా వారు అటవీ శాఖ సిబ్బందికి ఫోను చేసి చెప్పారు. అరగంటలో బీట్ ఆఫీసర్లు వచ్చారు. అయితే పాత ఓపీ రూములోంచి కింగ్ కోబ్రా వరండా ద్వారా బయటకు ఎటెళ్లిందో తెలియలేదు.

-మోతుగూడెం

ముమ్మిడివరంలో నల్ల త్రాచు

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ కొండాలమ్మ చింత సమీపంలో పాస్టర్ ఎలెక్స్ నివాసంలో సోమవారం ఒక ట్రంకు పెట్టెలోకి నల్ల తాచుపాము దూరి హల్‌చల్ చేసింది. దీంతో ఆ ఇంట్లోని వారు, చుట్టుపక్కల వారు భయభ్రాంతులకు గురయ్యారు. పాస్టర్ ఎలెక్స్ స్నేక్ క్యాచర్ గణేష్ వర్మకు సమాచారం అందించడంతో ఆయన వచ్చి పామును చాకచక్యంగా పట్టి డబ్బాలో బంధించారు. దానిని నిర్మానుష్య ప్రాంతంలో వదిలిపెడతానని గణేష్ వర్మ చెప్పారు.

-ముమ్మిడివరం





రాజమహేంద్రవరం ఇస్కాన్ మందిరం సమీపంలో ఉట్టి ఉత్సవాన్ని తిలకిస్తున్న ప్రజలు



రాజమహేంద్రవరం ఇస్కాన్ మందిరంలో రాధాగోపీనాథులు



కాకినాడ మధురానగర్‌లోని గోకులంలో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు



గోదావరిలో హంస వాహనంపై తెప్పోత్సవం



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో బాల కృష్ణుడు

రత్నగిరిపై ఘనంగా శ్రీకృష్ణాష్టమి

అన్నవరం, ఆగస్టు 26: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో సోమవారం శ్రీకృష్ణాష్టమిని వేడుకగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు మంగళవాయిద్యాల నడుమ సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను కళామందిరం వద్దకు తోడ్కొని వచ్చి ఆశీనులు గావించారు. స్వామి, అమ్మవార్ల ఎదురుగా సప్తగోమాతలను ఉంచి పండితులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులతో గోవు వెనుక భాగంలో అర్చింపచేసి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో రామచంద్రమోహన్, పీఆర్వో కృష్ణారావు పాల్గొనగా వైదిక కార్యక్రమాలను ఇంద్రగంటి వెంకటేశ్వర్లు, చామర్తి కన్నబాబు, పాలంకి పట్టాభి నిర్వహించారు. తూర్పు రాజగోపురాన్ని ఆనుకుని ఉన్న శ్రీగోకులంలో అర్చకుడు కంచిబొట్ల వరదయ్య ఆధ్వర్యంలో శ్రీకృష్ణపరమాత్ముడికి విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం రామాలయం ఎదురుగా యాదవ బాలలతో ఉట్టి సంబరం జరిపారు. రాత్రి ఏడు గంటలకు స్వామి, అమ్మవార్లను పల్లకిలో తొలిపావంచా వద్దకు మెట్లమార్గంలో తీసుకొచ్చారు. విశేష పూజల అనంతరం భక్తుల కోలాహలం నడుమ ఉట్టి కొట్టించారు. యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కొండ దిగువ గోశాలలో సూపరెంటెండెంట్ ఐవీ రామారావు పర్యవేక్షణలో తొలిసారిగా కృష్ణాష్టమి వేడుకలు జరిపారు.



అన్నవరం దేవస్థానంలో గోపూజను తిలకిస్తున్న ఈవో రామచంద్రమోహన్, భక్తులు



ఇస్కాన్‌లో సందడే సందడి

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 26: రాజమహేంద్రవరం గౌతమ ఘాట్‌లోని ఇస్కాన్ రాధా గోపీనాథ్ దశావతార మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంబరాన్నంటాయి. తెల్లవారుజామున 4.30 గంటలకు మహా మంగళహారతితో ప్రారంభించి శృంగార హారతి, శ్రీమద్ భాగవత ప్రవచనం, పూర్ణాహుతి, అవభృద స్నానం నిర్వహించారు. మధ్యాహ్నం ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు, నృత్యం, పాటలు పోటీలు నిర్వహించారు. విజేతలకు హేమా నిమాయిదాస్ సారథ్యంలో బహుమతులు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు తదితరులు విచ్చేశారు. సాయంత్రం ఉట్టి ఉత్సవం, అనంత శేషవాహన సేవ, తెప్పోత్సవం, శ్రీకృష్ణ లీలామృత ప్రవచనం, రాధాగోపీనాథులకు మహాకుంభాభిషేకం, మహా ప్రసాద వితరణ జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీకృష్ణస్వామిని దర్శించుకుని ఆయన ఆశీస్సులు పొందారు.



వి.సృజన్, ఎస్.రవికిరణ్

జిప్‌మర్, ఎయిమ్స్‌లో 'ఆదిత్య' విద్యార్థులకు సీట్లు

కాకినాడ రూరల్, ఆగస్టు 26: నీట్-2024 ప్రవేశ పరీక్షలో కాకినాడ ఆదిత్య జూనియర్ కళాశాల గంగరాజునగర్ బ్రాంచ్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి ప్రతిష్టాత్మకమైన జిప్‌మర్, ఎయిమ్స్‌లో మెడికల్ సీట్లు సాధించినట్టు ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి తెలిపారు. వి.సృజన్ 715, ఎం.విశ్వాంత్ 705 మార్కులతో జిప్‌మర్‌లోను, వైనైమితారాణి 705, ఎస్.రవికిరణ్ 710, ఆర్.రామ్‌గోపాల్ 695 మార్కులతో ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ సీట్లు సాధించారన్నారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆదిత్య విద్యా సంస్థల కార్యదర్శి ఎన్.కృష్ణదీపక్‌రెడ్డి ప్రిన్సిపాల్ జె.మొయినా అభినందించారు.





బ్యారేజ్‌పై నుంచి పిచ్చుకలంకను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే బండారు, ఒబెరాయ్ సంస్థ ప్రతినిధి, పర్యాటక మ్యాప్‌ను మంత్రి దుర్గేష్‌కు చూపిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

పిచ్చుకలంకను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతాం

- పెట్టుబడులు పెట్టేందుకు ఒబెరాయ్ సంస్థ ప్రతినిధులు ముందుకొచ్చారు
- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్
- ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గోదావరి తీరం పరిశీలన

ఆత్రేయపురం, ఆగస్టు 26: ఉభయ గోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న పిచ్చుకలంకను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఒబెరాయ్ సంస్థ ప్రతినిధులు ముందుకు వచ్చారని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక శివారు పిచ్చుకలంక ప్రాంతాన్ని సోమవారం మంత్రి దుర్గేష్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కలెక్టర్ మహేష్‌కుమార్, ముంబయికి చెందిన ఒబెరాయ్ సంస్థ ప్రతినిధులు పరిశీలించారు. 50 ఎకరాల్లో పిచ్చుకలంకను అభివృద్ధి చేసేందుకు ఒబెరాయ్ సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపడంతో ఈ పర్యటన చేపట్టారు. ఒబెరాయ్ సంస్థ ప్రతినిధులకు పిచ్చుకలంక ప్రాంత అభివృద్ధితో పాటు ఉభయగోదావరి జిల్లాల్లో ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాల వివరాలను వివరించారు. పిచ్చుకలంక అభివృద్ధిపై ఒబెరాయ్ సంస్థ ప్రతినిధులు ఇప్పటికే సీఎం చంద్రబాబును కలిశారని, పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలియజేశారని మంత్రి దుర్గేష్ తెలిపారు. హోటల్స్, రిసార్ట్స్, బోట్ షికారు వంటి వాటికి పిచ్చుకలంక అనువుగా ఉంటుందని సంస్థ ప్రతినిధులకు మంత్రి వివరించారు. అఖండ గోదావరి ప్రాంతం కావడంతో పర్యాటకులను ఆకర్షిస్తుందన్నారు. ఒబెరాయ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ శంకర్‌జీ, ప్రముఖ ఆర్కిటెక్ట్ వినోద్ గోస్వామితో కూడిన త్రిసభ్య కమిటీ బృందం ఈ ప్రాంతాన్ని పరిశీలించి విశిష్ట ప్రాంతాల మ్యాప్‌ను క్షుణ్ణంగా అధ్యయనం చేసింది. రానున్న పుష్కరాలకు పిచ్చుకలంకను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రి చెప్పారు. తద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని మంత్రి, ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. కార్యక్రమంలో వాసిరెడ్డి రాంబాబు, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, సర్పంచ్ నరాలశెట్టి సుబ్బలక్ష్మీవెంకన్న, మాజీ సర్పంచ్ జల్లి కామేశ్వరరావు, టీడీపీ నాయకులు కంఠంశెట్టి శ్రీనివాస్, ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహరావు, ముళ్ళపూడి భాస్కరరావు, కాయల జగన్నాథం, జనసేన నాయకుడు బండారు బాబి పాల్గొన్నారు.



నిందితుడు జయరామ్‌ను చూపిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

పది కిలోల గంజాయి స్వాధీనం

ఒకరి అరెస్టు... రిమాండ్‌కు తరలింపు

గోకవరం, ఆగస్టు 26: గంజాయి కలిగి ఉన్న ఓ వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్టు నార్త్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు సోమవారం తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని రామన్నపాలెం కూడలి వద్ద బ్యాగ్‌తో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని కోరుకొండ సీఐ వై.సత్యకిషోర్ గమనించి అదుపులోకి తీసుకుని విచారించారు. బ్యాగ్‌ను తనిఖీ చేసి సుమారు 10 కిలోల గంజాయిని గుర్తించారు. నిందితుడిని అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం జాముగూడకు చెందిన వంతల జయరామ్‌గా నిర్ధారించారు. కాగా అతడు ఈనెల 23వ తేదీన 813.590 కిలోల గంజాయితో పట్టుబడిన బొలెరో వాహనం యజమానిగా నిర్ధారణ అయ్యింది. బొలెరో వాహనం వదిలి పరారైన వ్యక్తుల్లో ఒడిసా రాష్ట్రం చిత్రగుంటకు చెందిన డ్రైవర్ కిల్లో జయరాం ఉన్నట్టు తెలిసింది. తాంగి చంద్ర అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. జయరామ్‌ను అరెస్టు చేసి రిమాండు నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించినట్టు డీఎస్పీ చెప్పారు.

అనుమానం పెనుభూతమై...

భార్యను డంబెల్‌తో మోది హతమార్చిన భర్త

అనపర్తి, ఆగస్టు 26: తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలో ఓ వ్యక్తి భార్యపై అనుమానంతో డంబెల్‌తో తలపై మోది హతమార్చాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన తుపాకుల సాయి, అరుణకుమారిలకు 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరు పదేళ్ల క్రితం జీవనోపాధి కోసం అనపర్తి వచ్చి జీవనం సాగిస్తున్నారు. పది, ఏడేళ్ల వయసున్న ఆడపిల్లలు ఉన్నారు. సాయి కోడిగుడ్ల వ్యాన్‌పై డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల భార్య వివాహేతర సంబంధం కొనసాగిస్తోందేమోనని అనుమానం పెంచుకున్నాడు. దీంతో తరచూ మద్యం తాగొచ్చి చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. సోమవారం ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. మద్యం మత్తులో ఉన్న సాయి ఎక్సర్‌సైజ్ చేసే డంబెల్‌తో తలపై తీవ్రంగా మోదడంతో తీవ్ర రక్తస్రావమై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సీఐ శివగణేష్, ఎస్ఐ శ్రీనునాయక్ సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





అరుణ కుమారి మృతదేహం (ఎడమ), పాత చిత్రం (కుడి)

శ్వాస ఆడక మరో బాలుడు మృతి



మృతి చెందిన 45 రోజుల చిన్నారి

చింతూరు, ఆగస్టు 26: శ్వాస ఆడక మరో బాలుడు మృతి చెందిన సంఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం నర్సింగపేటలో చోటుచేసుకుంది. నర్సింగపేటకు చెందిన దుమ్మిరి బాబూరావు-సుబ్బలక్ష్మి కుమారుడు అశ్విన్ (45 రోజుల చిన్నారి) ఆదివారం వాంతులు, విరోచనాల బారిన పడ్డాడు. దీంతో చింతూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుడు బిడ్డను పరీక్షించి రెండు రకాల సిరప్‌లు ఇవ్వడంతో పాటు మరో రెండు రకాల సిరప్‌లు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటుగా కొనుగోలు చేసుకోమని చెప్పారు. కొద్ది సమయం తర్వాత బిడ్డ ఆరోగ్య పరిస్థితి కాస్త మెరుగుపడినట్టు కనిపించడంతో ఆసుపత్రి నుంచి ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యంలో శ్వాస తీసుకోవడంలో బిడ్డ ఇబ్బందిపడింది. దీంతో కూనవరం మండలంలోని కోతులగుట్ట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని... వెంటనే మెరుగైన వైద్యం కోసం భద్రాచలం తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు బాధిత కుటుంబీకులు తెలిపారు. ఇప్పటివరకు చింతూరు, కూనవరంల్లో శ్వాసకోశ తదితర వ్యాధుల బారిన పడి ఐదుగురు చిన్నారులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ బాలుడి మృతితో మృతుల సంఖ్య ఆరుకు చేరింది.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

రౌతులపూడి, ఆగస్టు 26: మాయమాటలు చెప్పి ప్రేమ, పెళ్లి పేరుతో మైనర్ బాలికను యువకుడు గర్భవతి చేసిన ఘటన లచ్చిరెడ్డిపాలెంలో జరిగింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి సోమవారం విచారణ చేపట్టారు. కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం లచ్చిరెడ్డిపాలెంలో చందనాడ కాశీ (21) పాల కేంద్రం నిర్వహిస్తున్నాడు. ఓ బాలిక అమ్మమ్మ గారింటికి వస్తుండగా మాయమాటలు చెప్పి లోబరుచుకుని గర్భవతి చేశాడు. యువతి కడుపు నొప్పి వస్తోందని చెప్పడంతో తల్లిదండ్రులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించగా బాలిక గర్భవతి అని తేలింది. దీంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి విచారణ చేపట్టారు. యువకుడు ప్రస్తుతం పరారీలో ఉన్నాడు.

రైలు నుంచి జారిపడి ఒడిసా వాసి మృతి

అనపర్తి, ఆగస్టు 26: తూర్పు గోదావరి జిల్లా అనపర్తి రైల్వే స్టేషన్‌లో సోమవారం తెల్లవారుజామున రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. సామర్లకోట జీఆర్పీ ఎస్ఐ బి.లోవరాజు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... సామర్లకోట నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నుంచి ఓ ప్రయాణికుడు జారి పడ్డాడని అనపర్తి రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ బి.శ్రీధర్ సమాచారం మేరకు అనపర్తి వెళ్లేటప్పటికి ఆ వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. అతడి వద్ద ఉన్న ఆధార్ కార్డు ప్రకారం ఒడిసాకు చెందిన చిత్రాసేన్ దాస్(42)గా గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- భక్తులతో కృష్ణుడి ఆలయాలు కిటకిట
- ఘనంగా ఉట్టి కొట్టే కార్యక్రమాలు
- గోపిక, రాధాకృష్ణుల వేషధారణల్లో చిన్నారులు

పవన్‌కల్యాణ్ పుట్టిన రోజున సేవా కార్యక్రమాలు

అల్లవరం, ఆగస్టు 26: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సెప్టెంబరు 2న మెగారక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించాలని జనసేన పార్టీ మండల సమావేశంలో తీర్మానించారు. కంకిపాటి వీరబాబు అధ్యక్షతన జనసేన సమావేశం జరిగింది. కటికిరెడ్డి బాబి, మేడిద శంకరరావు, చిట్నీడి శ్రీనివాస్, చికిలే చిట్టిబాబు, చాట్ల మంగతాయారు, పెన్మత్స సోమరాజు, కంకిపాటి సుబ్బారావు, పిల్లా ప్రసాద్, కుంచే వినయ్, నల్లా రాము, వంగా దొరయ్యనాయుడు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



ఆలమూరులో శ్రీకృష్ణుడు, రాయవరం: వెదురుపాక గీతా మందిరంలో శ్రీకృష్ణుడు. ముమ్మిడివరం: ముమ్మిడివరంలో రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుడు, ద్రాక్షారామ: రావులపాలెం, అంతర్వేది, అమలాపురంలలో రాధాకృష్ణుల వేషధారణల్లో చిన్నారులు

అమలాపురం టౌన్, ఆగస్టు 26: అమలాపురం భాష్యం స్కూలులో సోమవారం రాధాకృష్ణులు, గోపికల వేషధారణలతో చిన్నారులు అలరించారు. జోనల్ ఇన్‌చార్జి జవ్వాది వెంకటశ్రీనివాస్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సీహెచ్ రవి, చాంప్స్ ఇన్‌చార్జి కె.నాగశ్రీ పాల్గొన్నారు. రావులచెరువు శ్రీరామాలయం వద్ద శ్రీరామసేవాసమితి అధ్యక్షుడు గొవ్వాల అచ్యుతరామయ్య ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త రేలంగి కుమార్‌శంకర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కృష్ణవేషధారణ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. డాక్టర్ కొప్పినీడి వెంకటరమణకుమార్, డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, పి.రామ్మోహనరావు, గొవ్వాల నాగరాజు, సుంకర ప్రసాద్, సలాది సాయిరామ్, కవురు సత్యనారాయణ-అనసూయ, యిళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అమలాపురం ఓంశాంతి కేంద్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. గోకులాన్ని తలపిస్తూ చిన్నారులు సందడి చేశారు. ఓంశాంతి కేంద్రం ఇన్‌చార్జులు బీకే శ్రీదేవి, బీకే స్వరూప కృష్ణాష్టమి విశిష్టతను వివరించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, జనసేన నాయకులు నల్లా శ్రీధర్, యేడిద శ్రీను, నాయకులు ఒంటెద్దు బాబి, యార్లగడ్డ రవీంద్ర, మాకిరెడ్డి వీఎన్‌ఎస్ పూర్ణిమ పాల్గొన్నారు.

అమలాపురం రూరల్‌లో..

జనుపల్లి ఇస్కాన్ రామాలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిపారు. ఇస్కాన్ మేనేజర్ శ్యామ్ సత్యధర్మదాస్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో విజేతలకు నాయకులు మెట్ల రమణబాబు, బొర్రా వెంకటేశ్వరరావు, చెల్లుబోయిన శ్రీనివాస్, దున్నాల దుర్గ, గంధం శ్రీను బహుమతులు అందజేశారు.

ముమ్మిడివరం: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ముమ్మిడివరంలో సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రీదేవి భూదేవి సమేత స్వామివారి ఆలయంలో రుక్మిణి, సత్యభామ సమేతంగా శ్రీకృష్ణుని అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు చిరంజీవాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అలాగే శ్రీకృష్ణ మందిరంలో బాలయోగీశ్వరుల తపో ఆశ్రమంలో ప్రత్యేక పూజలు జరిపించారు. కృష్ణాష్టమి వేడుకలను మండలంలో ఘనంగా జరుపుకున్నారు. కృష్ణుడికి ఇష్టమైన అటుకులు, బెల్లం, పాయసం నైవేద్యంగా సమర్పించారు. ప్రత్యేక పూజలు జరిపించారు. నగర పంచాయతీ పరిధిలో గొల్లలవీధి, క్రాప చింతలపూడిలలో కృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నారు.

కె.గంగవరం: కోటిపల్లి, పాణింగపల్లి, అముజూరు, యర్రపోతవరం తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని పూజలు చేశారు. ప్రసాదాలు పంపిణీ చేశారు.

మామిడికుదురు: మండలంలోని గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను భక్తులు నిర్వహించారు. పలుచోట్ల చిన్నారులు ఉట్టి కొట్టి అలరించారు. మామిడికుదురులోని కేతన్ యోగా సెంటర్‌లో యోగా గురువు ఆకుల ఖేతన్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. పలుచోట్ల చిన్నారులు రాధాకృష్ణులు, గోపికల వేషధరాణల్లో అలరిస్తూ వేడుకలు జరుపుకున్నారు.

పి.గన్నవరం: హరే కృష్ణ హరే కృష్ణ...కృష్ణ కృష్ణ హరే హరే అను నామస్మరణతో వైనతేయ గోదావరి నదీ తీరం మార్మోగింది. రెండు రోజులు పి.గన్నవరం వైనతేయ గోదావరి నదీ తీరాన నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా ముగిసాయి. శ్రీపట్టాభి రామస్వామి ఆలయ ప్రాంగణంలో గరుడ వేగ టీమ్, రామ సేతు భక్త బృందం ఆధ్వర్యంలో ద్వారక నగరం నుంచి తీసుకువచ్చిన విగ్రహాలను ప్రత్యేక మండపంలో కొలువుదీర్చారు. ఆదివారం అఖండ హరినామ సంకీర్తన ఏకాహం, సుదర్శన విష్వక్సేనుల వారి ఆరాధన కార్యక్రమాలు జరిగాయి. సోమవారం తులసీ హారతి, జన్మస్థల పూజ, గోమాత పూజ, స్వామివారికి నామకరణం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చిన్న కృష్ణుడిని ఎడ్ల బండిపై ఊరేగింపు, సుదర్శన లక్ష్మీనరసింహ హోమం ప్రధానఅర్చకులు రాంబాబు ఆచార్యులు ఆధ్వర్యంలో జరిగాయి. ప్రముఖ ప్రవచన కర్త, ఆధ్యాత్మిక, సామాజికవేత్త అనంతలక్ష్మి శ్రీకృష్ణుడు జన్మ వృత్తాంతాన్ని వివరించారు. అనంతరం స్వామివారికి మహిళలు అభిషేకాలు, లడ్డు గోపాలం, రాధాకృష్ణులకు ఉయ్యాలసేవ, మహాహారతి ఇచ్చారు. భారీ అన్నసమారాధనజరిగింది. పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు ప్రదర్శించారు. ఒడిశా రాష్ట్రం జగపతి జిల్లా కె.సీతాపురే గ్రామానికి చెందిన భజన బృందం ఆధ్వర్యంలో నగర సంకీర్తన, బొబ్బిలి పట్టణానికి చెందిన మహిళల కోలాటం తదితర కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సాయంత్రం స్వామివారిని గరుడు వాహనం, ఎడ్ల బండిపై ఊరేగించారు. ఉట్టి కొట్టేఉత్సవం, గోదావరి హారతి కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

అంతర్వేది: అంతర్వేది దేవస్థానం చెరువుగట్టు వద్ద శ్రీకృష్ణ యాదవ యూత్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పెద్దలు, యువకులు ఉట్టి ఉత్సవం చేపట్టారు. అంతర్వేది, రామేశ్వరం, మోరి, మోరిపోడు, సఖినేటిపల్లి తదితర గ్రామాల్లో ఉత్సాహంగా ఉట్టి కొట్టి యువకులు సందడి చేశారు.

రాజోలు: మండలంలోని గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాటిపాకలో మఠం ఏటిగట్టుపై ఉన్న శ్రీమురళీకృష్ణ ఆలయం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. రాజోలు గోశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు వివిధ వేషధారణల్లో అలరించారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామ గీతామందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెల్లలో వేంచేసియున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి పూజలు నిర్వహించారు. సాయంత్ర గ్రామసేవన అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం జరిగింది. రామచంద్రపురం పట్టణంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. మోడరన్ ఉన్నత పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. బాలకృష్ణుడు, గోపికల వేషాధారణల్లో విద్యార్థులు అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అకడమిక్ డైరెక్టరు ఆర్.ఉమాదేవి, మోడరన్ విద్యాసంస్థల అధినేత లయన్ జి.వి.రావు, హెచ్‌ఎం చిట్టిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయినవిల్లి: శ్రీకృష్ణ జన్మాష్టమిని మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నల్లచెరువులోని అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ ఇస్కాన్‌లో కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా జరిపారు. శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి సంకీర్తనలు చేశారు. ఎంపీ గంటి హరీష్‌మాధుర్ శ్రీకృష్ణ మందిర్‌ను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. నల్లచెరువులోని పద్మావతి అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని హరీష్‌మాధుర్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి సుందర్‌దాస్, గణేశుల వెంకటేశ్వరరావు, గణేశుల సత్యనారాయణ, వర్రే శ్రీనివాస్, ఇందుగుల వెంకట్రామయ్య, సలాది శ్రీరామకృష్ణ పాల్గొన్నారు.

రాయవరం: భక్తుల శ్రీకృష్ణ నామస్మరణల మధ్య వెదురుపాక గీతా మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త సత్తి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సత్తి విజయభాస్కరరెడ్డి, స్వాతి దంపతులు పీటలపై కూర్చుని పూజలు, హోమం జరిపారు. మహిళలు, భక్తులు నగర సంకీర్తన నిర్వహించి స్వామివారికి పల్లకిసేవ, భగవద్గీత 18అధ్యాయాల పారాయణ, విష్ణు సహస్రనామ పారాయణ, ఏకాహ భజనలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు విగ్రహాన్ని ఉయ్యాలసేవ నిర్వహించారు. గీతామందిరంలో కృష్ణమాలధారులు ప్రత్యేకపూజలు జరిపారు. చిన్నారులు గోపికలు, శ్రీకృష్ణుడు వేషధారణల్లో ఆకర్షణగా నిలిచాయి. అంగర జనార్థనాచార్యులు, పడాల శివమణికంఠరెడ్డి భక్తులు పాల్గొన్నారు. మండలంలోని వాడవాడలా శ్రీకృష్ణుడికి పల్లకిసేవ జరిపి, పూజలు, హారతులు, ఉట్టి కొట్టి జరిపిన కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. రాయవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవాసుదేవా యాదవ సంఘం, వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి.

కపిలేశ్వరపురం: అంగర, కపిలేశ్వరపురం, టేకి, కోరుమిల్లి, వాకతిప్ప, కేదార్లంక తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను జరుపుకున్నారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణల్లో శ్రీకృష్ణుడు గీతాలను ఆలపిస్తూ నృత్యాలతో అలరించారు. పలు గ్రామాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

మండపేట: మండపేట పట్టణం, మండలంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను జరుపుకున్నారు. మండపేట బూరుగుంట రామాలయం వద్ద, రథంగుడి సెంటర్‌లో శ్రీకృష్ణజన్మన వేడుకలు జరుపుకున్నారు. శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. పలు పాఠశాలల్లో చిన్నారులు వేసిన బాలకృష్ణుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. మండపేట అక్షరస్కూల్‌లో, మండపేట పబ్లిక్ స్కూల్‌లో చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

మలికిపురం: మండలంలో పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. యువకులు పలు ప్రాంతాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని పోటా పోటీ నిర్వహించారు. గొల్లపాలెంలో పాత రామాలయం వద్ద మహిళలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆలమూరు: ఆలమూరులో నూతనంగా నిర్మించిన కృష్ణుడి ఆలయంలో ఆలమూరు యాదవ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. వేదపండితులు వేదుల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. చింతలూరు, గుమ్మిలేరు, మడికి, చొప్పెల్ల, జొన్నాడ, నర్సిపూడి గ్రామాల్లో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు.

రావులపాలెం: మండలంలో భక్తులు కృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లోని ముఖ్యకూడలిల వద్ద యువకులు ఉట్టికొట్టి సందడి చేశారు.

ఆత్రేయపురం: కృష్ణాష్టమి వేడుకలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. సాయంత్రం గ్రామాల ముఖ్య కూడలి వద్ద ఉట్లోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. వాడవాడలా కృష్ణాష్టమి వేడుకలు అంబరాన్నంటాయి. లొల్ల లాకుల వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నసమారాధలో పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి, భీమనపల్లి, ఉప్పలగుప్తం, ఎస్.కొత్తపల్లి, పెదగాడవిల్లి తదితర గ్రామాల్లో జన్మాష్టమి సంబరాల్లో యువత పాల్గొని బాణసంచా కాల్చారు. ఉట్టి కొట్టి సంబరాలు చేసుకున్నారు.

అల్లవరం: బెండమూర్లంకలో శ్రీకృష్ణాష్టమి చారిటబుల్ ట్రస్టు, దేవగుప్తం, ఓడలరేవు గ్రామాల్లో శ్రీకృష్ణయాదవ యువజన సంఘాల ఆధ్వర్యంలో, మొగళ్ళమూరు, దేవగుప్తం, అల్లవరం తదితర గ్రామాల్లో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలుజరిగాయి. గ్రామాల్లో ఉట్టి కొట్టారు. బెండమూర్లంకలో ట్రస్టు ఆధ్వర్యంలో గీతాపారాయణం, 300మందికి వస్త్రదాణాలు జరిగాయి. చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, సినీనటుడు గుర్రం రామకృష్ణ, గుర్రం కృష్ణమూర్తి, గుర్రం కొండలరావు, ముత్యాల రామకృష్ణ, సోమాని వెంకటరమణ, గుండుమేను శ్రీనివాస్, గుర్రం బాబ్జి, కైల సందరరావు, నాగళ్ళ శేషారావు, చిట్టిమేను వీరన్నపాల్గొన్నారు.

అంబాజీపేట: వక్కలంక,గంగలకుర్రు, మాచవరం, గంగలకుర్రు అగ్రహారం, నందంపూడి, కె.పెదపూడి గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంట చిన్నారులకు వేసిన కృష్ణుడు, గోపికల వేషాధారణలు ఆకట్టుకున్నాయి. ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.

వయోపరిమితి పెంచాలని ఆందోళన

యానాం, ఆగస్టు 26: ప్రభుత్వ ఉద్యోగాల పోస్టుల భర్తీకి సంబంధించి వయోపరిమితిని పెంచాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ యువత పుదుచ్చేరి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగారు. యానాం పరిపాలనాధికారి కార్యాలయం ఎదుట పులువురు ఆందోళన చేపట్టారు. ఈఅంశంపై పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు చొరవ తీసుకుని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మల్లవరపు దయ, మున్న, విజయ్, వినయ్ పాల్గొన్నారు.

జొన్నాడ వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుకు రిపేర్లు

ఆలమూరు, ఆగస్టు 26: జొన్నాడ-మండపేట ఆర్‌అండ్‌బీ రోడ్డులోని జొన్నాడ వద్ద భారీ గుంతలు ఏర్పడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. జొన్నాడ టీడీపీ నాయకులు తాడి శ్రీనివాసరెడ్డి, గొడవర్తి దుర్గాప్రసాద్ స్పందించి సోమవారం రోడ్డుకు మరమ్మతులు చేయించారు. శ్రీనివాసరెడ్డి, దుర్గాప్రసాద్‌లను పలువురు అభినందించారు.

వెంకన్న ఆలయంలో సంప్రోక్షణకు శ్రీకారం

ఆలమూరు, ఆగస్టు 26: గుమ్మిలేరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజులు జరిగే సంప్రోక్షణ కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. పునర్నిర్మాణంలో భాగంగా రూ.40లక్షలతోఅభివృద్ధి పనుల అనంతరం ఆలయ సంప్రోక్షణ చేయడం కోసం సోమవారం వేదపండితులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు ప్రారంభించారు. వ్యాపారవేత్త వంక సత్యనారాయణ తులసి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

'పథకాలు ఎప్పుడు అమలు చేస్తారు'

మండపేట, ఆగస్టు 26: కూటమి ప్రభుత్వం పించన్ల పెంపుతప్ప సూపర్‌సిక్స్ పథకాల్లో ఏదీ అమలుచేయలేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండపేట - ఆలమూరు - జొన్నాడ రోడ్డు గోతులతో అధ్వానంగా ఉందన్నారు. మండపేట - ఏడిద రోడ్డు కూడా గోతులతో అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో 50ఏళ్లు నిండిన బీసీలు, ఎస్సీలు, మైనార్టీలకు పింఛన్లు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు.

సొరచేప సంరక్షణపై అవగాహన



బొక్కుసొర చేప నమూనా

యానాం, ఆగస్టు 26: ప్రపంచ వ్యాప్తంగా అంతరించిపోతున్న అరుదైన సముద్రజీవుల జాబితాలో ఒకటిగా ఉన్న బొక్కుసొర చేప సంరక్షణపై కోరంగి అటవీశాఖ, యానాం మత్స్యశాఖ సంయుక్త నిర్వహణలో మత్స్యకారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సోమవారం స్థానిక ఇందిరాగాంధీ ఫిష్‌మార్కెట్ ప్రాంగణంలో బొక్కుసొర చేప నమూనాతో అవగాహన కల్పించారు. సముద్రంలో లోతైన ప్రాంతాంలో జీవించే బొక్కుసొర చేపలు కాలుష్యం అరికట్టడానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మానవులకు వీటి వల్ల ఎలాంటి హాని ఉండదన్నారు. వలలో చిక్కుకుంటే వలను కత్తిరించి చేపను రక్షించాలని, వలకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం అందజేస్తుదని సెక్షన్ ఆఫీసర్ వీరభద్రరావు తెలిపారు. కార్యక్రమంలో యానాం మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దడాల గొంతెయ్య అధికారి సాదనాల నేరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ముమ్మిడివరం, ఆగస్టు 26: మర్లపాలెం శివారు కొబ్బరి తోటల్లో పేకాట శిబిరంపై ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేశారు. నలుగుర్ని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2050 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ


అమలాపురం టౌన్, ఆగస్టు 26: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ఈనెల31వరకు వారోత్సవ క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి పీఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. సోమవారం అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడా ప్రాంగణంలో క్రీడాకారులచే ఫిట్‌ఇండియా ప్రతిజ్ఞ చేయించారు. వసతి గృహ విద్యార్థులతో పాటు క్రీడాకారులు వంటెద్దు బాబీ, ఎంఎస్‌వీ ప్రసాద్, సురేష్, అరవింద్, బూరగాయల శివ, నల్లా శివ, కోచ్ ఐ.భీమేష్, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామి సేవలో దేవదాయ శాఖాధికారి

ద్రాక్షారామ, ఆగస్టు 26: ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని సోమవారం దేవదాయశాఖ జిల్లా అధికారి ఎం.లక్ష్మీనారాయణ సందర్శించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బేడా మండపంలో వేదాశీర్వచనం అందుకున్నారు.

సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను ప్రవేశపెట్టాలి

అమలాపురం టౌన్, ఆగస్టు 26: కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమును రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు డిమాండ్ చేశారు. జిల్లా ఎస్టీయూ కార్యాలయంలో సోమవారం నందెపు శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెప్టెంబరు 5న జరిగే ఉపాధ్యాయ దినోత్సవంలో భాగంగా జిల్లా, మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులపై చర్చించారు. అన్ని అర్హతలు పూర్తిస్థాయిలో ఉన్న ముత్యాల రవికుమార్‌ను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసేందుకు నిర్ణయించారు. ఈయన ప్రస్తుతం పాలగుమ్మి అంబేడ్కర్ నగర్‌లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. మండలస్థాయిలో వన్నెచింతలపూడి, కామనగరువు, ఎ.వేమవరం కాంప్లెక్సుల పరిధిలో ఒక్కో ఉపాధ్యాయుని పేరును మండల విద్యాశాఖ అధికారికి అందించేందుకు నిర్ణయించారు. సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించే అంశంపై చర్చించారు. ఓపీఎస్ తప్ప మరేమీ ఆమోద యోగ్యం కాదని తెలియచేస్తూ తీర్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, సీపీఎస్‌జిల్లా కన్వీనర్ బండారు నారాయణ, నాయకులు ఆకుల బాలబసవేశ్వరరావు, బాలనాగుగుప్తా, బసవా వేణుగోపాల్, సీహెచ్‌వీ కృష్ణమూర్తి, బొడ్డు సుబ్బారావు, మంగం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీయూ జిల్లాశాఖ ముఖ్య నాయకుల సమావేశం

నిండుశోకంతో అర్బయీన్



నగరంలో జరిగిన అర్బయీన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు

మామిడికుదురు, ఆగస్టు 26: కర్బలా పుణ్యభూమిలో వీర మరణం పొందిన ఇమామ్ హుస్సేన్, అతని 72మంది పరివారానికి ముస్లింలు ఘన నివాళులర్పించారు. ఇమామ్ హుస్సేన్ అమరత్వం పొందిన 40వ రోజు అర్బైన్‌ను సోమవారం ముస్లింలు నిండు శోకతప్త హృదయాలతో నిర్వహించారు. ఈసందర్భంగా నగరం బడేబీబీ పంజాలో మజ్లిస్ నిర్వహించి పీరును తీసి మాతం నిర్వహిస్తూ గుర్రంపై పీరును ఊరేగించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మత ప్రబోధకుడు యూసఫ్ అహ్మద్‌మషద్దీ కర్బలా సంఘటనలను భక్తులకు వివరించగా వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇస్లాం మత ఉనికిని పరిరక్షించిన ఇమామ్ హుస్సేన్, అతని తనయుడు జైనుల్ అబేదిన్, సోదరి బీబీజైనబ్‌లకు అంజలి ఘటిస్తూ బ్లేడ్లు, కత్తులతో హుస్సేన్ హుస్సేన్ అంటూ శరీరాలను గాయపరుచుకుని రక్తం చిందించారు. ఊరేగింపు నగరం పెదపంజీష వరకు జరిగింది. పెదపంజీష వద్ద భక్తులు కర్బలా వీరులకు రక్త తర్పణాలర్పించి అంజలి ఘటించారు. అర్బైన్ కార్యక్రమంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొని ఇమామ్ హుస్సేన్ త్యాగనిరతిని కొనియాడారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు స్థానిక భక్త బృందాలు ప్రసాదాలను వితరణ చేశాయి. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

గుర్రాలపై పీర్లు ఊరేగింపు

ద్రాక్షారామ, ఆగస్టు 26: ద్రాక్షారామలో అర్బయీన్ (40వ రోజు సంతాప దినాలు) సోమవారంతో ముగిసాయి. సంతాప దినాలను ముస్లింలు నిండుశోకంతో జరుపుకున్నారు. కర్బలా పుణ్యభూమిలో 1385 సంవత్సరాల క్రితం మహమ్మద్ ప్రవక్త మనమడు హజరత్ ఇమాం హుస్సేన్, ఆయన పరివారం వీరమరణం చెందడం, ఇస్లాం పరిరక్షణకు వారు అనుభవించిన కష్టాలను స్మరించుకుంటూ విలపించారు. 5రోజులు జరిగిన సంతాప కార్యక్రమాలు సోమవారంతో ముగిసాయి. 40వ రోజు అర్బయీన్‌ను ఖననం చేసిన రోజును స్మరించుకుని విషాదగేయాలు ఆలపించారు. అషూర్‌ఖానా నుంచి పంజతని పంజా వరకు మాతం నిర్వహించారు. గుర్రాలపై పీర్లను ఊరేగించారు.

ఎమ్మెల్యే చొరవతో ఉచిత వైద్య సేవలు

ముమ్మిడివరం, ఆగస్టు26: ఎమ్మెల్యే చొరవతో ఒక వ్యక్తికి వైద్య సేవలందించారు. అనాతవరానికి చెందిన చవ్వాకుల కుమారస్వామి ఇటీవల మహిపాల చెరువు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడికి రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు లేకపోవడంతో ఆరోగ్యశ్రీ పథకంలో ఉచిత వైద్యం పొందడానికి అవకాశం లేకపోయింది. దీంతో ఆ గ్రామ టీడీపీ అధ్యక్షుడు కురసాల శివబాబు పరిస్థితిని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సీఎం క్యాంపు కార్యాలయానికి మాట్లాడి సీఎంసీవో లెటర్ రప్పించడంతో అతనికి ఉచిత వైద్యసేవలందాయి. దీంతో కుమారస్వామి, అతని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే బుచ్చిబాబుకు, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి ఎంపీ హామీ

ఆలమూరు, ఆగస్టు26: ఆలమూరు ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల భవనాల నిర్మాణం, కాలేజీల అభివృద్ధికి సహకరిస్తానని అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్ హామీఇచ్చారు. కాలేజీల భవనాలు శిథిలావస్థకు చేరి తరగతుల నిర్వహణకు ఇబ్బందిగా మారిందని, నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సహకరించాలని కాలేజీ అభివృద్ధి కమిటీ నాయకులు గుణ్ణం వీర్రాజు, గారపాటి త్రిమూర్తులు ఎంపీ హరీష్‌కు వినతిపత్రం అందించారు. కాలేజీల అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరిస్తానని ఎంపీ హరీష్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హామీ ఇచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

గల్ఫ్ జనసైన్యం కమ్యూనిటీ గ్రూపు సేవలు మరువలేనివి

రాజోలు, ఆగస్టు 26: గల్ఫ్ జనసైన్యం కమ్యూనిటీ గ్రూపు సేవలు మరువలేనివని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. గల్ఫ్ జనసైన్యం కమ్యూనిటీ గ్రూపు సమకూర్చిన రూ.10వేల నగదును వివేకానంద మనోవికాసం కేంద్రం నిర్వాహకురాలు మటపర్తి లక్ష్మికి ఎమ్మెల్యే వరప్రసాద్ అందించారు. జనసేన పార్టీ భీమవరం మండలాధ్యక్షుడు మోకా శ్రీనివాస్, గ్రూపు సభ్యులు బర్రే నాగరాజు, కొల్లాటి నరసింహస్వామి, ఎన్.ఏడుకొండలు పాల్గొన్నారు.

ఘనంగా దీప్తి డిగ్రీ కళాశాల యూత్ ఫెస్టివల్

రాజోలు, ఆగస్టు 26: రాజోలు రోటరీ క్లబ్‌లో మామిడికుదురుకు చెందిన దీప్తి డిగ్రీ కళాశాల యూత్ ఫెస్టివల్-2024ను సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత విద్యా సంస్థల చైర్మన్ డీవీవీ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మలికిపురం ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్వీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ టీవీవీ సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలనచేశారు. అనంతరం జిల్లాస్థాయిలో విద్య, వైద్య, సామాజిక, సేవా రంగాల ప్రముఖులను సన్మానించారు. ప్రతిభా పోటీల్లో విజేతలైన 46మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.రంగారావు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రావులపాలెం ఎస్‌ఐగా చంటి



రావులపాలెం,ఆగస్టు26: రావులపాలెం ఎస్‌ఐగా చంటి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ఇక్కడ ట్రాఫిక్ ఎస్‌ఐగా పనిచేసి బదిలీపై వెళ్లారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించారు.

రేపు డయల్ యువర్ డీఎం

అమలాపురంటౌన్, ఆగస్టు26: అమలాపురం ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై ఈనెల28న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. బుధవారం ఉదయం 10.30 నుంచి 11.30గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రయాణికులు సలహాలు, సూచనలను సెల్: 9581932678కు తెలియజేయాలని కోరారు.

మంత్రి సుభాష్‌కు సత్కారం

అమలాపురం టౌన్, ఆగస్టు 26: కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను అమలాపురంలోని ఆయన స్వగృహం వద్ద ఆధ్యాత్మిక వేత్త రేలంగి కుమార్‌శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో అయినవిల్లి నాగేంద్రకుమార్‌గౌడ్, ఐవీ రామకృష్ణ, సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఈరి ప్రసాద్, మార్గన ప్రసాద్, రేలంగి మధు, కనకలింగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలల్లో క్రీడా పోటీలు

అమలాపురం టౌన్, ఆగస్టు 26: మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఈనెల29న జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించనున్నట్లు ఒలింపిక్ అసోసియేషన్ జిల్లాశాఖ, క్రీడాభారతి ప్రతినిధులు తెలిపారు. క్రీడాభారతి అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎంపికచేసిన 30ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు క్రీడా భారతి జిల్లాశాఖ అధ్యక్ష, కార్యదర్శులు అల్లాడ శరత్‌బాబు, పప్పుల శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. పరుగు పందెం, జంప్, త్రోస్పోర్ట్స్ ఈవెంట్‌లు నిర్వహించి విజేతలకు 36 పతకాలు, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. జిల్లాస్థాయి నుంచి ఉత్తమ క్రీడాకారులను గుర్తించి రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని డాక్టర్ గోకరకొండ నాగేంద్ర తెలిపారు. విజేతలకు 29న నేషనల్ స్పోర్ట్స్‌డేను పురస్కరించుకుని బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కల్వకొలను భుజంగవాణి, బాబు, రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, జోనల్ కన్వీనర్ జేఎస్‌ఎల్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

మదర్‌థెరెసా జయంతి వేడుకలు

కపిలేశ్వరపురం, ఆగసు 26:పలు గ్రామాల్లో సోమవారం మదర్‌థెరిసా జయంతి వేడుకలు నిర్వహించారు. అంగర సినిమా థియేటర్ల జంక్షన్ వద్ద ఉన్న థెరిస్సా విగ్రహానికి నాయకులు మత్సా గంగరాజు, ఆచంట చిన్న, చీకట్ల శ్రీను, మేడేపల్లి వీరాస్వామి, కనకరామకృష్ణ, పైడి రమణ, యానాల సుబ్బారావు నివాళులర్పించారు. అంగర పీహెచ్‌సీ వద్ద వెన్నేటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తిరునాతి వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులుమదర్‌థెరిస్సా విగ్రహానికి నివాళులర్పించారు.

మురుగుకాల్వలో పడి యువకుడి మృతి

ఉప్పలగుప్తం, ఆగస్టు 26: గొల్లవిల్లి పంచాయతీ వాడపర్రు ఇందిరా నగర్‌కు చెందిన గుర్రాల అక్కురాజు(35) ప్రమాదవశాత్తూ మురుగుకాల్వలో పడి మృతి చెందాడు. అక్కురాజు ఆదివారం సాయంత్రం వంట చెరకు కోసం బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అన్వేషించగా అర్ధరాత్రి సమయంలో సమీపంలోని మురుగుకాల్వలో శవమై కనిపించాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు అతడి సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

మామిడికుదురు, ఆగస్టు 26: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు కోరారు. మామిడికుదురులోని ఎస్సీ సామాజిక భవనంలో మండలశాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ అధ్యక్షతన సోమవారం బీజేపీ నాయకుల సమావేశం జరిగింది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడితో పాటు జిల్లా సభ్యత్వ ప్రముఖ్ పాలూరి సత్యానందం మాట్లాడారు. సభ్యత్వ నమోదుకు 88000 02024 నంబరుకు మిస్డ్‌కాల్ ఇచ్చి ఫొటోతో సహా నరేంద్ర మోదీ యాప్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు, పసుపులేటి మహాలక్ష్మిరావు, గాడి సత్తిబాబు, నక్కా త్రిలోచనరావు, పాలూరి జయప్రకాష్‌నారాయణ, అడపా వెంకటరత్నం, కటికిరెడ్డి గంగాధరం పాల్గొన్నారు.

అంతర్వేది: గొంది గ్రామంలో బీజేపీ పార్టీ అధ్యక్షుడు పట్టాపు సూర్యప్రకాశరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ మాట్లాడుతూ బీజేపీని బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మండల సభ్యత్వ ప్రముఖ్‌లుగా పోతురాజు సురేష్, పోతిశెట్టి గంగాశ్రీగిరిబాబు, కొణతం శ్రీనివాస్‌లను నియమించారు. కార్యక్రమంలో మాలే శ్రీనివాసనగేష్, చెంపాటి శివరామకృష్ణంరాజు, అడబాల రాంబాబు, బోనం నాయుడు, రావూరి బాబ్జి, యెనుముల సుబ్బారావు, కానుబోయిన నాగరాజు, బర్రే నరసింహస్వామి పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: బీజేపీ సభ్యత్వాల నమోదుపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోన సత్యనారాయణ అన్నారు. సోమవారం కపిలేశ్వరపురంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లిసాయిరాం, సూరంపూడి సత్యనారాయణ, పెదపాటి వసంత, గుబ్బల గోవింద్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మలికిపురం: బీజేపీ సభ్యత్వాల నమోదును విజయవంతం చేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంకిపాటి సుబ్బారావు అన్నారు. గుడిమెల్లంకలో కె.కనకేశ్వరరావు అధ్యక్షతన జరిగిన బీజేపీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతానికి ప్రతీకార్యకర్త నడుం బిగించాలన్నారు. ఎన్డీఏ హయాంలో రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. మాలే శ్రీనివాసనగేష్, ఇందుకూరి అచ్యుతరామరాజు, అడబాల నరసింహారావు, అడబాల సత్యనారాయణ, అడబాల రాంబాబు, చెంపాటి శివరామకృష్ణంరాజు పాల్గొన్నారు.

కూటమి విజయానికి కృషిచేసిన నాయకులకు గుర్తింపు

అంబాజీపేట,ఆగస్టు26: కూటమి ప్రభుత్వం విజయానికి కృషిచేసిన ప్రతి నాయకుడికి మంచి గుర్తింపు లభిస్తుందని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేటలో టీడీపీ నాయకుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ గణపతి వీరరాఘువులు పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పుట్టినరోజు కేక్‌ను కట్ చేశారు. నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ నామన రాంబాబు, నాయకులు మెట్ల రమణబాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, బొంతు పెదబాబు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: డిమోంటీ
శ్రీలలిత	: కమిటీ కుర్రోళ్లు
శేఖర్ స్క్రీన్-1	: మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
శేఖర్ స్క్రీన్-2	: డబుల్ ఇస్మార్ట్
రమా	: ఆయ్
గణపతి	: రేవు
వెంకటపద్మావతిస్క్రీన్-1	: తంగలాన్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: ఏలియన్ రొమ్యులస్